విద్యుత్ కోతలకు చెక్

- వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల్లో గతంలో విద్యుత్‌కోతలు
- కరెంట్ ఎప్పుడు వచ్చేది, ఎప్పుడు పోయేది తెలియని పరిస్థితి
- సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు
- లూస్ లైన్లకు అదనపు పోల్లు, చెట్ల తొలగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్ల పొదలు తొలగించిన విద్యుత్‌శాఖ సిబ్బంది


లూస్ లైన్లలో కొత్త విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

శాంతినగర్: అసలే కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, ఆపై వేల జనాభా నివాసాలు. పల్లెల నుంచి వివిధ పనులు, వ్యాపారాలు, ఉద్యోగాల కోసం ఎందరో వచ్చి మున్సిపాలిటీల్లో సౌకర్యాలు బాగుంటాయని చేరారు. కొందరు సొంత ఇళ్లలో నివాసం ఉండగా, మరికొందరు అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. ఇంటికి అతి ముఖ్యమైన సౌకర్యం కరెంట్. ఏడాది కాలంగా పట్టణాలలోని ఆయా వార్డుల్లో తరచూ విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి వేళల్లో కరెంట్ పోయిందంటే ఇక అంతే, మరుసటి రోజు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ప్రజలు చేసే ఫోన్లు తట్టుకోలేక స్విచ్ ఆఫ్ చేసుకునే పరిస్థితి విద్యుత్‌శాఖ అధికారులది. పట్టణ వాసులు తరచూ ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల అలంపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో విద్యుత్‌శాఖ అధికారులు ప్రతి మున్సిపాలిటీలో రెండు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటుచేసి విద్యుత్ అంతరాయానికి ఎక్కడెక్కడ సమస్యలున్నాయో తెలుసుకుని నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా అడుగులు వేశారు. అధికారులు చేపట్టిన మరమ్మతు పనుల వల్ల పట్టణాల్లో ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంలేదని ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సబ్ స్టేషన్లలో..

నియోజకవర్గంలోని వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీలకు అనుసంధానంగా ఉన్న ఆయా సబ్‌స్టేషన్లలో మొదట సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు అడుగులు వేశారు. అలంపూర్, శాంతినగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మొదట మరమ్మతులు చేపట్టారు. అనంతరం 11 కేవీ ఫీడర్లలో విద్యుత్ సమస్య తలెత్తినచో ఫీడర్లు ట్రిప్ అవడం, సామగ్రి కాలిపోకుండా చూడటం, విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడటం వంటి పనులు చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద..

అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల పరిధిలోని ఆయా వార్డుల్లో గృహ నిర్మాణాలు, వ్యాపారాలకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసే 38 ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంప చెట్లు తొలగించడం, కేబుల్స్ మార్చడం, ఫెన్సింగ్ చక్కబెట్టడంలాంటి పనులు చేపట్టారు.

చెట్ల కొమ్మలు తొలగించడం

11 కేవీ హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లకు ఇబ్బంది కరంగా వున్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టారు. ఆయా మున్సిపాలిటీల్లో రెండు రోజులపాటు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

కొత్త స్తంభాల ఏర్పాటు

రెండు మున్సిపాలిటీల్లోని ఆయా వార్డుల్లో లూస్ లైన్‌లను సరి చేసేందుకుగాను అక్కడక్కడ మధ్యలో పోల్స్ పాతడం జరిగింది. దీంతో గాలులు వచ్చినా విద్యుత్ వైర్లు ఒకటికి మరొకటి తగలవని, లైన్లు ట్రిప్ కావని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగదని అధికారులు చెబుతున్నారు.

రాత్రి వేళల్లో కరెంట్ లేకపోయేది



కొద్దిగా గాలులు వీచినా, వర్షం కురిసినా, చెట్ల కొమ్మలు కొట్టుకున్నా రాత్రి వేళల్లో కరెంట్ లేకపో యేది. విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే ఉదయం వచ్చి చూస్తామని చెప్పేవారు. ఇటీవల మున్సిపాలిటీలో రెండు రోజులు కొన్ని గంటలపాటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. గత వారం రోజులుగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడం లేదు.

– గొంగ్ల్ల రాముడు, శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

ఉక్కపోతతో అల్లాడేవాళ్లం



మున్సిపాలిటీలో తరచూ కరెంట్ పోయేది. రాత్రి, పగలు కరెంట్ లేక ఉక్కపోతతో సతమతమయ్యేవాళ్లం. దోమల వల్ల చాలా ఇబ్బందిగా ఉండేది. వారం రోజుల నుంచి నిరంతరంగా కరెంట్ సరఫరా అవుతోంది. దీంతో ప్రశాంతంగా పనులు చేసుకుంటున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ

విడతల వారీగా మరమ్మతులు చేపడతాం



అలంపూర్ సబ్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి, అలంపూర్, మున్సిపాలిటీలు, వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, ఎర్రవల్లి, అలంపూర్ మండలాల్లో 71,528 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మున్సిపాలిటీలకు, ఆయా గ్రామాలకు నిరంతరంగా కరెంట్ ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. బుధ,గురువారాల్లో ఆయా సబ్ స్టేషన్‌ల పరిధిలో విడతల వారీగా పనులు చేపట్టి వి ద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపడతాం.

– సయ్యద్ చిన్న మక్బూల్, ఏడీఈ, అలంపూర్ సబ్ డివిజన్

'ఉపాధి'లో రూ.33 వేల అవినీతి

- 28 గ్రామాల్లో రికవరీకి ఆదేశం
- మధ్యరాత్రి వరకు కొనసాగిన పబ్లిక్ హియరింగ్

ధరూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో స్వల్పంగా జరిగిన అక్రమాలను సోషల్ ఆడిట్ అధికారులు నిగ్గు తేల్చారు. ఏడాది పాటు జరిగిన రూ.7 కోట్ల పనుల్లో పెనాల్టీ, రికవరీ కలిపి కేవలం రూ.33వేల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది తేల్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ కార్యక్రమం మధ్యరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. మొత్తం 28 గ్రామ పంచాయతీలకు గాను అత్యధికంగా ఖమ్మపాడులో రికవరీ రూ.9049, 2,500 పెనాల్టీ పడింది. మండల వ్యాప్తంగా 16వేల పెనాల్టీ పడగా, రూ.17007 రికవరీకి ఆదేశించారు. మొత్తంగా మండలంలో రూ.33వేల అవినీతి జరిగినట్లు సోషల్ ఆడిట్ సిబ్బంది తేల్చారు. అవినీతికి సంబంధించిన వివరాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ జబ్బార్, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ కాశన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ

గట్టు: మండలంలోని రాయాపురంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సభ్యులు రాయాపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకుని వేమన పద్యాలున్న అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. వేమన భగవాన్ పద్యాలలోని జ్ఞానం గురించి కమిటీ సభ్యులు తెలిపారు. ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ ఉన్నారు.

కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అయిజ: పట్టణంలోని గుంతరామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఆదివారం కార్మిక శాఖ వారి ఆధ్వర్యంలో సీఎస్ హెల్త్ కేఆర్, భారతీయ మజ్దూర్ సంగ్ వారు తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ సంఘం వారి సహకారంతో లేబర్ కార్డు కలిగిన 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులకు రక్తపోటు, గుండె పనితీరు, షుగర్ స్థాయి, కొలస్ట్రాల్‌తో పాటు సుమారు 50 రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జీ రమేష్, జిల్లా కోఆర్డినేటర్ బాల్‌రాజ్, భవన నిర్మాణ కార్మికులు, ప్రభుదాస్, తిమ్మప్ప, హనుమంతు, సంజీవ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎల్కూరు రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి


ఎల్కూరులో రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్: మండలంలోని ఎల్కూరు, మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న బీటీ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని వాహనదారులు తిప్పన్న, రాజు, రాముడులు పేర్కొన్నారు. నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 20ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బీటీ రోడ్డుపై రైతులు తమ పంటపొలాలకు నీరు పారించేందుకు రోడ్డును తవ్వి పైపులైన్లను ఏర్పాటు చేసుకున్నారు. పైపులైన్‌ను ఏర్పాటు చేసుకున్న రోడ్డుపై ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను తవ్వి పైపులైన్లను ఏర్పాటు చేసుకున్న రైతులు, ఆర్ అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు రోడ్ల మరమ్మతుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు నోటిఫికేషన్

అయిజ: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంకు సంబంధించి కమిషనర్ హెల్త్, ఫ్యామిలీ వెల్‌ఫేర్ తెలంగాణ హైదరాబాద్ వారు జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజలో నిర్వహిస్తున్న బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ శశికళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీబీఎస్ పట్టభద్రులైన అభ్యర్థులు, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు వయసు, కుల ధ్రువీకరణ పత్రం, లోకల్ స్టేటస్, 1 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, అక్నాలడ్జిమెంట్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేసి ఈనెల 10వ తేదీలోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గురుకుల ప్రవేశ పరీక్ష



గట్టు: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం ఇంటర్ సీఓఈ (సెంటర్ ఫర్ ఎక్సలెన్స్) ప్రవేశ పరీక్షను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు గట్టులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. గట్టు గురుకులలోని ఇంటర్మీడియట సీఓఈగా మార్చారు. ఇంటర్‌తో పాటుగా జెఈఈ మెయిన్స్‌కు విద్యార్థులను సిద్ధం చేస్తుంటారు. గురుకుల ఇంటర్ ప్రవేశం కోసం మొత్తం 600 మంది విద్యార్థులకు గాను 580 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 20 మంది గైర్హాజర్ అయినట్లు ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రిన్సిపాల్ వాణి, డిపార్టుమెంట్ అధికారిగా సువర్ణలు వ్యవహరించారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత




అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపురం గ్రామానికి ఎస్సీ కమ్యూనిటీ హాల్ కోసం జెడ్పీ నిధుల నుంచి రూ.4 లక్షల ప్రొసీడింగ్ కాపీని జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్ గ్రామస్తులకు అందజేశారు. చర్చి పైకప్పు (స్లాబ్) నిర్మాణం కోసం రూ.20 వేలు విరాళంగా పాస్టర్ నహిమియకు జెడ్పీటీసీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, రఫీ, భాస్కర్, మద్దిలేటి, ఆంజనేయులు, మధు, ఉప సర్పంచ్ నర్సింహనాయుడు ఉన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

మల్దకల్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల నాయకులు బిజ్వారం శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని సద్దలోనిపల్లి, బిజ్వారం, మల్దకల్ గ్రామాలలో బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్, రాజశేఖర్, గోవింద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించండి



మానవపాడు: మండల కేంద్రంలోని పాతరోడ్డు గుండా మానవపాడు వయా గోకులపాడు, చెన్నిపాడు మీదుగా వెళ్లే రోడ్డు మట్టితో ఉంది. ఈ రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. ప్రయాణించడానికి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు సీసీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రాయచూర్-గద్వాల ప్రధాన రహదారి పక్కనున్న అంబేద్కర్ చౌక్ వద్ద మిషన్ భగీరథ కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. రహదారిపై ప్రయాణం చేస్తున్న వాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ఆదమరిస్తే గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రోడ్డు పక్కన గుంతలను పూడ్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన ఏర్పడుతోంది. అధికారులు స్పందించి వాటిని సరిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

12 నుంచి బ్రహ్మోత్సవాలు

- 14న రథోత్సవం
- పెద్దచింతరేవులలో ముస్తాబవుతున్న ఆలయం


బ్రహ్మోత్సవాలకు ముస్తామైన ఆలయం


స్వామి వారి రథానికి రంగులు వేస్తున్న దృశ్యం


ఆంజనేయస్వామి మూల విగ్రహం

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ సిబ్బంది ఇప్పటికే ఏర్పాట్లను ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ఈ సారి మరింత ఘనంగా నిర్వహించేందుకు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. అంజన్న బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఆదివారం నుంచి ఆలయానికి సున్నం, రంగులు వేసే పనులు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి రథాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి.

కార్యక్రమాలు..

సోమవారం 12న అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 13న ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీసేవ, ప్రభోత్సవం, 14న రాత్రి 10 గంటలకు రథోత్సవ, 15న ప్రభోత్సవం, 16న అవభృత స్నానం, 17న భీష్మాష్టమి, 18న మధ్వ నవమి, 19న మాఘ శుద్ధ దశమి సోమవారం పల్లకీ సేవ స్వస్తీ వచనం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్తనూరులో ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



అయిజ: మండలంలోని ఉత్తనూరులో ఈనెల 12 నుంచి 18 వరకు నిర్వహించనున్న ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి జూపల్లి కృష్ణారావును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఆదివారం సెక్రటరేట్‌లో మంత్రి చేతుల మీదుగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు గౌతంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రైతు సంబరాల కన్వీనర్ మందాడి చిదంబర్‌రెడ్డి, రైతు సంబరాల వ్యాఖ్యత నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన ఉత్సవాలు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో కర్ణాటక దాస సాహిత్యంలో గోపాల విట్టల బిరుదాంకితులైన గోపాల దాసుల ఆరాధన ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం స్వామివారి ఆలయంలో వేదపండితులు సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, హస్తోదకం, ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పురాణ వచనాలు, సంకీర్తనలు, దాసుల వారి సుళధులు ఆలపిస్తూ భజన మండలి సభ్యులు భక్తిని చాటుకున్నారు. పూజా కార్యక్రమంలో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన కరస్పాండెంట్



శాంతినగర్: ఎవరి ఆదరణ లేకుండా అనాథగా బతుకుతున్న ఓ వ్యక్తికి అన్ని సౌకర్యాలు సమకూర్చి ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ మానవత్వం చాటుకున్నాడు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ రవీంద్ర ఎయిడెడ్ ఉన్నతపాఠశాల సమీపంలో వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆరుబయట చెట్టు కింద ఉంటూ దుర్భర జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్వర్లు దీన స్థితిని గమనించిన శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు అనాథ వ్యక్తిని ఆదరించాలని వాట్సాప్ గ్రూపుల్లో పిలుపునిచ్చారు. స్పందించిన స్థానిక సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ రవి అనాథకు అవసరమైన దుస్తులు, కప్పుకోవడానికి దుప్పటి, నిత్యవసర సరుకులు అందజేశాడు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ రవి గతంలో కూడా చాలా మందికి తన సేవా దృక్పథంతో సౌకర్యాలు కల్పించి ఆసరాగా నిలిచారని కొనియాడారు. శాలువా పూలమాలతో దాత రవిని సన్మానించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, రాజు, ఖలీల్, హరీష్, కలిముల్లా, మాలిక్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి


గట్టులో మాట్లాడుతున్న బల్గెర శివారెడ్డి

గట్టు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి పల్లెల్లోని ప్రజలకు తెలియజేద్దామని బీజేపీ సీనియర్ నాయకులు బల్గెర శివారెడ్డి, మధుసూదన్‌రావులు తెలిపారు. ఆదివారం గట్టులో గావ్ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆదివారం నుంచి 11 వరకు బీజేపీ గావ్ చలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బల్గెర శివారెడ్డి, మధుసూదన్‌రావులు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు వాల్మీకి దేవదాసు, ఓబీసీ టౌన్ అధ్యక్షుడు నర్సింహులు, సీనియర్ నాయకులు మధుసూదన్‌రావు, కిట్టుస్వామి, సోమేష్, మోహన్‌చంద్ర, ఆంజనేయులుగౌడు, సురేష్, కర్రెప్ప, పాండునాయక్, రాముడు, రాఘవేంద్ర, సంజీవనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల రెడ్డి గావ్ చలో అభియాన్ కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాదన్న, మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవపాడు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందాలని బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్, మండల కమిటీ సభ్యులు రవి, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ప్రధాని నరేంద్రమోదీ పాలనతో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి అన్నారు. ఎర్రవల్లి మండలం కోదండాపురంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టే గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. నాయకులు జగదీష్, జనార్ధన్‌రెడ్డి, రాజు, శివరాంరెడ్డి ఉన్నారు.

16న కార్మిక ప్రదర్శన గ్రామీణబంద్



అమరచింత: దేశ వ్యాప్తంగా ఈనెల 16న కార్మిక ప్రదర్శన గ్రామీణ బందు కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. పట్టణంలోని జీఎస్ భవన్‌లో ఆదివారం కార్మిక, వ్యవసాయ, రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30వేల ఇవ్వాలని, రాష్ట్రంలో రూ.21 వేల వేతనం అమలుచేయాలని కోరారు. ఫిబ్రవరి 10న అమరచింత మండల కేంద్రంలో వాహన ర్యాలీ నిర్వహించాలని, ఇందుకు కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అసోసియేషన్ సభ్యుల చేయూత



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ రాజేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న జిల్లా, వివిధ మండలాలకు చెందిన బైక్ మెకానిక్ అసోషియేషన్ సభ్యులు ఆదివారం ఎర్రవల్లికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం తమ అసోషియేషన్ తరపున బాధిత కుటుంబానికి రూ. 43,000 ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, రాజేంద్రారెడ్డి, మధు, హరీష్, నరేష్, వీరారెడ్డి, సుధాకర్, దేవరాజ్, చాంద్‌బాషా, సత్యం, రమేష్ ఉన్నారు.

రేపటి నుంచి పాన్‌గల్ ఈదమ్మ జాతర



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఈదమ్మ దేవత జాతర మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు పూజారి నాగన్న తెలిపారు. అమ్మవారి జాతర రెండు రోజుల పాటు జరుగుతుందని, మొదటి రోజు షిడి, రెండో రోజు పోలారం బండ్లు, బోనాలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. జాతర వేడుకలకు మండలంలోని భక్తులతో పాటు పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవారి గుడి పరిసరాల్లో మిఠాయిలు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. అమ్మవారిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని, పంటలు, పాడి సంవృద్ధి వస్తుందని నమ్మకం. ఈదమ్మ ఉత్సవాల కోసం గుడిని ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ, గుడి కమిటీ సభ్యుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గద్వాల-రాయచూర్ రోడ్డు బాగు చేయండి



కేటీదొడ్డి: గద్వాల-రాయచూర్ ప్రధాన రహదారి మండలంలోని ఉమిత్యాల బస్టాండ్ దగ్గర అధ్వానంగా తయారైన రోడ్డును బాగు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కేటీదొడ్డి నుంచి గద్వాల వెళ్తున్న రోడ్డు గుంతలుగా ఏర్పడ్డాయి. కొన్నేళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రతిరోజు ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వృథాగా పారుతున్న నీరు



మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీల్లోని బోర్ వాటర్ నుంచి ప్రజల సౌకర్యార్థం కుళాయి నిర్మాణాలు చేపట్టారు. అయితే కుళాయి నుంచి పారే నీరు వృథాగా పారుతోంది. నీరు వృథాగా పారకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

రాజోళి: మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ రాను న్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ముందుకు సాగాలన్నారు. జలాశయాల్లో కూడా నీరు అనుకున్నంతగా లేనందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని, నీటి కోసం ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.